సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబిహా బేగం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌లోని అన్ని బస్తీల్లో తాగునీటి పైపులైన్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలను అధునాతన వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, మోయిజ్, ఖాదర్ పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న అపార్టుమెంట్ వాసులు

కూకట్‌పల్లి: సంగీత్‌నగర్‌లోని స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. ఉదయం నుంచే పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాన్‌లేక్ వాసులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌వాసులు పాల్గొన్నారు.

వీల్‌చైర్, నిత్యావసర సరుకుల అందజేత



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్ ఫేజ్–2లో నివాసముంటున్న దండంపల్లి రామస్వామి షుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఆపరేషన్ చేసి కాలు తీసివేశారు. దీంతో నడవలేని స్థితిలో రామస్వామి ఉండగా హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సహకారంతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా వీల్‌చైర్, నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్య, ఆమె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, భిక్షపతి, మధులత, మీరయ్య, నరసింహులు, మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, రవికిరణ్, అమూల్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లమ్మ చెరువు పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం'



పనులు పరిశీలిస్తున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, తదితరులు

ఆల్విన్‌కాలనీ: రూ.2 కోట్లతో ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సీవరేజ్ డైవర్షన్ లైన్ పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ ఆరోపించారు. స్థానికులతో కలిసి సోమవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరగడం లేదని అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎల్లమ్మ చెరువు సుందరీకరణ చేసి కబ్జాకు గురైన ప్రాంతాన్ని కూడా కాపాడాలని కోరారు.

పాలమూరు యూనివర్సిటీ వీసీకి సన్మానం



కేపీహెచ్‌బీకాలనీ: పాలమూరు యూనివర్సిటీ వీసీగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డా. జీఎన్ శ్రీనివాస్‌ను తన చాంబర్‌లో పలువురు విద్యార్థులు కలిశారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో ఆయన పరిశోధక విద్యార్థులు డా. జగదీశ్ కుమార్, డా. రాజు, కే. నరేశ్, ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థులు డా. చంద్రమౌళి, సయ్యద్ అహ్మద్ ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పటి నుంచి విద్యార్థులను ఎంతో ప్రోత్సహించారని, అదే విధంగా సమయపాలన విషయంలోనూ చాలా ఖచ్చితంగా ఉండేవారన్నారు. ఆయన ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు.

ఘనంగా ఎమ్మెల్యే బర్త్‌డే వేడుకలు



కూకట్‌పల్లి: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.





ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్

- కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మొదటి రోజు 95 మంది హాజరు
- దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- ఎగ్జామ్ సెంటర్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, డీసీపీ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. 118 మందికి 95 మంది హాజరుకాగా 23 మంది గైర్హాజరయ్యారు. 114 మంది దివ్యాంగులకు పరీక్ష రాసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 114 మంది విద్యార్థులను లేఖర్లుగా నియమించారు. అదనంగా మరో 22 మంది లేఖర్లను సిద్ధంగా ఉంచారు. ఈ పరీక్ష కేంద్రంతో పాటు వీఎస్ఆర్ కళాశాల కేంద్రంలో కూడా మరో 108 మంది దివ్యాంగ అభ్యర్థులకు లేఖర్లుగా వెళ్లారు. ఇందులోనూ మరో 22 మంది అదనంగా సిద్ధంగా ఉంచారు. మొత్తంగా కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 269 మంది లేఖర్లుగా నియమించబడ్డారు. వీరికి ప్రతిరోజు మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పించనున్నారు. ప్రతిరోజు ఉదయం కళాశాలలో వీరి తరగతుల అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు అభ్యర్థులకు లేఖర్లుగా ఉంటారు. 27వ తేదీ వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు.



లేఖర్లతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా





కూకట్‌పల్లి కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా..

కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్– 1 మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా సోమవారం పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. జిల్లా పరిధిలో 27 కేంద్రాల్లో 17,762 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని, మధ్యాహ్నం 1.30 గంటల్లోపే అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. దివ్యాంగుల కోసం జిల్లా పరిధిలో 4 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే దివ్యాంగులకు పరీక్షలు రాసే లేఖరులకు సలహాలు, సూచనలు చేశారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ సురేశ్ కుమార్..

కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ముత్తుతో కలిసి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.



కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సురేశ్ కుమార్

కాంగ్రెస్ హయాంలోనే ఆలయాలపై దాడులు



ప్రగతినగర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, హిందు సంఘాలు

నిజాంపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాలపై దాడులు పెరిగిపోయాయని బీజేపీ నాయకుడు ఎం.ఆర్.ఎస్.రాజు ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి వద్ద నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసుల అమానుష దాడికి నిరసనగా సోమవారం ప్రగతినగర్‌లో హిందూ సంఘాలు ర్యాలీ చేపట్టాయి. ఈ సందర్భంగా మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని, ఆలయాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాడి జరిగిన ప్రతిసారి నిందితులపై పిచ్చోళ్లనే ముద్రవేసి దుండగులను కాపాడాలని ప్రభుత్వ పెద్దలు, పోలీసులు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హిందువులంతా ఏకమై మతోన్మాద శక్తులను అడ్డుకొని సనాతన ధర్మ పరిరక్షణకై పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రగతినగర్ అల్లూరి సీతారామ రాజు విగ్రహం నుంచి మొదలైన ర్యాలీ ఏనుగుబొమ్మలు, కోతిబొమ్మలు, నెమలి బొమ్మల చౌరస్తాల మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు కొనసాగింది. అల్లూరి, భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో నాగిశెట్టి శేషారావు, రచ్చ చక్రధర్, రామచంద్ర నాయక్, సత్యనారాయణ, విజయ్, ధనంజయ, కౌశిక్ నాయుడు, గోపి, రామ నారాయణ, దాట్ల వెంకటపతి రాజు, శ్రీనివాస్ భరత్ ముఖ్, ప్రవీణ్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో సర్వే నంబర్ 329/4, 329/10 లో గతంలో మాదిరిగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకం కింద 95 శాతం మేర యజమానులు అనుమతులు తీసుకున్నారన్నారు. అయితే తర్వాత వివిధ కారణాలు చూపుతూ అనుమతులు ఇవ్వడంలేదని, దీనివల్ల స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు. ఇదే విషయమై గోపాల్ నాయుడు అనే స్థల యజమాని అనుమతి రాకపోవడంతో గుండెపోటుతో మృతి చెందాడని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కొంతమంది హైకోర్టు అనుమతితో నిర్మాణం చేపడుతున్నారని, అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్వీప్ ద్వారా ఓటరు నమోదు శాతం పెంచుతాం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా స్వీప్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఓటరు నమోదు శాతాన్ని పెంచుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్వీప్ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అర్బన్ ఓటరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యాసంస్థలలో ఓటరు నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్ జెండర్లు, వృద్ధుల పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డిఓ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

బాలానగర్: కాప్రాలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ ఈ నెల 23న బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడో మహాసభలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి జి. కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని 15 మండలాల నుంచి బీసీ ప్రతినిధులు, బీసీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర బాధ్యుడు ఎన్ బాలమల్లేశ్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సభల్లో బీసీ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే



దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం, కార్పొరేటర్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ శోభనా కాలనీలోని దర్గాను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ సోమవారం సందర్శించారు. అనంతరం అరబ్షా బాబా సందల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెంట్రింగ్ పరికరం పడి బాలుడి మృతి

మోతీనగర్: నిర్మాణంలో ఇంటిపై నుంచి సెంట్రింగ్ పరికరం పడి బాలుడు మృతి చెందిన ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ దేవరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆర్కే సొసైటీలో ఓ ఇంటి నిర్మాణం వద్ద ఇమ్రాన్ (6) బాలుడు ఆదివారం ఆడుకుంటున్నాడు. అదే సమయంలో పై నుంచి సెంట్రింగ్ పరికరం పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. సమీపంలోని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు సోమవారం మృతి చెందాడని ఎస్ఐ దేవరాజ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విశ్వకర్మ అసోసియేషన్ నూతన కార్యవర్గం



బాలానగర్: బాలానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బాలనగర్ మండల విశ్వకర్మ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా రాజేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అజి మాధవన్, సెక్రటరీ అనిష్, జాయింట్ సెక్రటరీగా శ్రీజిత్, కోశాధికారిగా అరుణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు.

నత్తనడకన భూ క్రమబద్ధీకరణ

- ◆ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో జాప్యం
- ◆ హెల్ప్ డెస్కుల ఏర్పాటు
- ◆ నగర శివారుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు
- ◆ విచారణ పూర్తయిన దరఖాస్తులు 11 వేలు మాత్రమే



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో లే–అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల విచారణ నత్తనడకన కొనసాగుతోంది. దరఖాస్తుదారులకు సంబంధిత సిబ్బంది విచారణకు రావాలని సమాచారం అందించినప్పటికీ ముందుకు రావడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పురపాలక సంఘాల అధికారుల అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు, విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలుకల్పించేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ. 1000 రుసుముతో ప్లాట్లు, రూ.10 వేల రుసుముతో వెంచర్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ జారీ ప్రక్రియ మూలకు పడగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో 3.85 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

◆ నగర శివారుల్లో అత్యధికంగా పదుల సంఖ్యలో స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేసి, వందల సంఖ్యలో ప్లాట్లు విక్రయించి రూ. లక్షలు దండుకున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖలు, పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసిన వాటికి అనుమతి లేని కారణంగా మళ్లీ వాటిని తిరిగి అమ్ముకోలేకపోతున్నారు.

◆ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పలు శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన ప్రారంభించారు. ఎల్–1 నుంచి ఎల్–4 వరకు నాలుగు దశల్లో విచారణ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చిన దరఖాస్తులను హెచ్ఎండీఏ నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), నీటి పారుదల శాఖ ఏఈలు పరిశీలిస్తారు. పురపాలక సంఘాల పరిధిలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్లాట్లలో ప్రభుత్వ భూమి, చెరువు, కుంట శిఖం, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించి ఉంటే అనుమతి నిరాకరిస్తారు. అన్ని సక్రమంగా నాలుగు దశల్లో పరిశీలనలు చేసి అనుమతి జారీ చేస్తారు. నగర శివారుల్లో 3.85 లక్షల దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయిలో విచారణకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలువురు కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్ పత్రాలు, ఈసీ పత్రాలను జత చేయకపోవడంతో ప్లాట్లను గుర్తించలేకపోతున్నారు. కొన్ని ఏరియాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లు కనిపించకుండా పోయాయి. ఇప్పటి వరకు నగర శివారుల్లో 11 వేల దరఖాస్తులను విచారించగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 5 వేల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలుస్తోంది.

పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తులకు కావాల్సిన పత్రాలను జత చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అన్ని పత్రాలు తీసుకురావాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవటంతో కలెక్టరేట్‌లతో సహా పురపాలక సంఘాలు, మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

ప్రజావాణికి 32 ఫిర్యాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని పలువురు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు. టౌన్‌ప్లానింగ్ 21, ఇంజినీరింగ్ 8, ఎలక్ట్రికల్ 3, శానిటేషన్‌పై ఒకరు ఫిర్యాదు చేశారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, సీపీ గణపతి, ఎస్‌డబ్ల్యూం, సీఈసీ ఉదయ్ కుమార్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు, ఫిర్యాదుదారులు

ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



సుభాష్‌నగర్: హైదరాబాద్ ఆర్చ్ డయోసెస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సూరారంలోని ఎన్టీఆర్ భవన్‌లో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత కంప్యూటర్, పేపర్ ప్లేట్ తయారీ శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. సీడీపీఓ రేణుక, సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోనీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు తమ కాళ్లపై నిలబడేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా 200 మంది ట్రాన్స్‌జెండర్లతో ర్యాలీ తీసి సొసైటీ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ, కిరాణా దుకాణాలను ప్రారంభించారు. క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ సభ్యురాలు మలా, సొసైటీ డైరెక్టర్ జాస్మిన్, స్టార్ కిరణ్ రాజ్, స్టేట్ లీగల్ సర్వీసెస్ సురేష్, క్రిస్టఫర్ పాల్గొన్నారు.